సాక్షి జనగామ

బుధవారం । 19 । మార్చి । 2025



సినీఫక్కీలో కోర్టుకు హరిబాబు

సామాజిక కార్యకర్త రాజలింగమూర్తి హత్య కేసులో నిందితుడు హరిబాబు, అతడి పరారీకి సహకరించిన మరో ఇద్దరిని పోలీసులు కోర్టులో హాజరుపరిచారు. - 8లో▸



సామాజిక అభ్యున్నతికి దోహదం

భారత రాజ్యాంగం సామాజిక వ్యవస్థ అభ్యున్నతికి దోహదపడుతున్న విలువైన డాక్యుమెంట్ అని ఏపీ హైకోర్టు పూర్వ న్యాయమూర్తి జస్టిస్ పీఎస్ నారాయణ అన్నారు. - 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
37⁰ /22⁰

జిల్లాలో ఉదయం పొగమంచు కురుస్తుంది. మధ్యాహ్నం ఉష్ణోగ్రత అధికంగా ఉంటుంది. రాత్రి చలిగా ఉంటుంది.



న్యూస్‌రీల్

భూ సమస్యలు పరిష్కరించాలి

అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్



బచ్చన్నపేట: జిల్లా వ్యాప్తంగా రెవెన్యూ కార్యాలయాల్లో భూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్ అన్నారు. మంగళవారం మండలంలోని కొడవటూర్ గ్రామంలోని శ్రీ సిద్ధేశ్వరాలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయంలో పలు భూ రికార్డులను పరిశీలించారు. త్వరలోనే దేవాదుల మూడో దశ పైప్ లైన్ నీరు వస్తాయని, రైతులు అధైర్యపడొద్దన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ప్రకాశ్‌రావు, డీటీ ఫణికిషోర్, ఏఆర్ఐ మున్వర్, అధికారులు పాల్గొన్నారు.

సోమేశ్వరాలయానికి వెండి హారతుల బహూకరణ



పాలకుర్తి టౌన్: శ్రీసోమేశ్వర లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి భక్తుడు వెండితో తయారు చేసిన 8 రకాల హారతులను మంగళవారం బహూకరించినట్లు ఆలయ ఈఓ సల్వాది మోహన్‌బాబు తెలిపారు. ఆలయ అర్చకుడు దేవగిరి లక్ష్మన్న సూచనల మేరకు స్వామివారి పూజ కార్యక్రమాల్లో హారతులు ఇచ్చేందుకు నల్లగొండకు చెందిన ఎన్ఆర్ఐ భక్తుడు సోమ కార్తీక్, తేజశ్రీ దంపతులు రూ.2,26,900 విలువైన 2 కేజీల292 గ్రాముల మిశ్రమ వెండితో తయారు చేసిన 8 హారతులను అందించినట్లు ఈఓ తెలిపారు.

విద్యారంగానికి నిధులు కేటాయించాలి



జనగామ రూరల్: రాష్ట్ర బడ్జెట్‌లో విద్యకు మొత్తం బడ్జెట్‌లో 15శాతం నిధులు కేటాయించాలని సాధిక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఏకశిల డిగ్రీ కళాశాల నుంచి జనగామ చౌరస్తా వరకు చేరుకుని నిధులు పెంచాలని కోరుతూ ప్లకార్డులతో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా సాధిక్ ఫౌండేషన్ చైర్మన్, హైకోర్టు న్యాయవాది సాధిక్ అలీ మాట్లాడుతూ విద్యకు బడ్జెట్ నిధులు పెంచే వరకు విద్యా మహోద్యమం కొనసాగుతుందన్నారు. యూనివర్సిటీల పేరు మారిస్తే విద్యా ప్రమాణాలు పెరగవని, వాటిని అన్ని స్థాయిల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తూ అధ్యాపకులను నియమించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాలల విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భక్తుల ఇంటికే భద్రాద్రి తలంబ్రాలు

● డీఎం స్వాతి



జనగామ: జనగామ ఆర్టీసీ డిపో లాజిస్టిక్స్ (కార్గో) ద్వారా భక్తుల ఇంటి వద్దకే సీతారాముల కల్యాణ తలంబ్రాల కోసం బుకింగ్ చేసుకునే అవకాశం కల్పించినట్లు డిపో మేనేజర్ స్వాతి తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ సీతారామ చంద్రస్వామి కల్యాణ తలంబ్రాలు అవసరమున్న భక్తులు జనగామ బస్టాండ్ ఆవరణలోని కార్గో లాజిస్టిక్స్ ఆఫీస్‌లో డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ అవినాష్, సంబంధిత ఏజెంట్‌ను సంప్రదించి, రూ.151తో ముందస్తు బుకింగ్ చేసుకుని, రశీదు పొందాలన్నారు. కల్యాణ మహోత్సవం అనంతరం, తలంబ్రాలను కార్గో ఏజెంట్ ద్వారా ఇంటికి పంపిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 9154 298762 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

చింతపండు @ 12,700

జనగామ ఏఎంసీలో మూడు కేటగిరీల్లో కొనుగోళ్లు

- వేలం పాటతోనే కొనుగోళ్లు చేయాలని రైతుల డిమాండ్
- జిల్లాలో తగ్గిన దిగుబడి



మార్కెట్‌కు అమ్మకానికి వచ్చిన చింతపండు

క్వింటా చింతపండు ధర (రూ.ల్లో)	ఏ గ్రేడ్ రకం:	బీ గ్రేడ్ రకం:	సీ గ్రేడ్ రకం:
	12,700	9,000	8,000

జనగామ: జనగామ వ్యవసాయ మార్కెట్‌లో చింతపండు గిట్టుబాటు ధరకు మించిపలుకుతుంది. జిల్లాలో ఈసారి చింత దిగుబడి తగ్గడంతో గతేడాదితో పోలిస్తే రకాన్ని బట్టి 70 నుంచి 100 శాతం పెరిగింది. ఒకింత రైతులు సంతోషంగా ఉన్నప్పటికీ... ఆశించిన మేర దిగుబడి లేకపోవడంతో సరాసరి మిగులు బాటుతోనే సరి పుచ్చుకుంటున్నారు. హోల్‌సెల్ మార్కెట్‌లో కిలో చింతపండు రూ.90 నుంచి రూ.127 పలుకుతుంది. రిటైల్‌గా రూ.150కి కూడా అమ్ముతున్నారు. జనగామ మార్కెట్‌కు యాదాద్రి భువనగిరి, సూర్యాపేట, జనగామ, సిద్దిపేట జిల్లాలకు చెందిన రైతులు నిత్యం జిల్లా కేంద్రంలోని ఏఎంసీకి చింతపండును తీసుకువచ్చి విక్రయిస్తున్నారు.

జిల్లాలో ఒకశాతమే అటవీ ప్రాంతం..

జిల్లాలో అటవీ ప్రాంతం ఒక శాతం మాత్రమే ఉంది. బచ్చన్నపేట మండలం సాల్వాపూర్, మన్సాన్‌పల్లి, నర్మెట, జనగామ మండలం తదితర ప్రాంతాల్లో కొంత మేర అటవీ ప్రాంతం విస్తరించి ఉంది. అటవీ ప్రాంతం ఉన్నప్పటికీ, పెద్దగా చింత చెట్లు లేవు. రైతుల వ్యవసాయ పొలాలతో పాటు గ్రామాల్లో సొంతంగా పెంచుకున్న చెట్లు మాత్రమే ఉంటాయి. ఆ చెట్లను గుత్తేదారులకు ఒక్కో చెట్టుకు రూ.3వేల నుంచి రూ.5వేలకు కుల్లుగుత్తగా ఇచ్చేశారు. గత కొంత కాలంగా గుత్తేదారులు చింత పూతను కాపాడుకుంటూ, దిగుబడి తగ్గిపోకుండా రాత్రింబవళ్లు అక్కడే కాపలా ఉన్నారు. అయినప్పటికీ ఆశించిన మేర దిగుబడి రాలేదు. ఒక్కో చెట్టుపై కాయలు రాల్చేందుకు రూ.1000, కాయలను కొట్టి చింతపండు తయారు చేసేందుకు గంపకు రూ.150 నుంచి రూ.200 చెల్లించారు. చెట్టుకు అద్దె, కూలీల ఖర్చు తడిసి మోపెడు కావడంతో గుత్తేదారులకు మిగులుబాటు అవుతుందా? అనే సందేహంలో ఉన్నారు.

మార్కెట్‌లో 170 క్వింటాళ్లు కొనుగోళ్లు..

ఈసారి చింతపండు దిగుబడి తగ్గడంతో మార్కెట్‌లో ఒక్కసారిగా ధర పెరిగింది. గతేడాది క్వింటా చింతపండు ధర రూ.6,180, రూ.6వేలు, రూ.6,150 మూడు ధరలు పలుకగా.. ఈ సారి ఊహించని విధంగా ధర పలుకుతుంది. ప్రస్తుత సీజన్‌లో ఏ గ్రేడ్ చింతపండు క్వింటాకు రూ.12,700, బీ, సీ, రకానికి రూ.9 వేలు, రూ.8వేల మేర ధర పలికింది. ఇప్పటి వరకు మార్కెట్‌లో 170 క్వింటాళ్ల చింతపండు కొనుగోలు చేయగా, ప్రైవేట్ మార్కెట్‌లో 500 క్వింటాళ్ల వరకు అమ్మకాలు జరిగినట్లు సమాచారం.

ధర ఆశాజనకంగా ఉంది..



మూడు చెట్లను రూ.10వేలకు గుత్తకు తీసుకున్నా. మొదటిసారి చెట్టుకు రెండున్నర క్వింటాళ్ల మేర చింతపండు, రెండున్నర క్వింటాళ్ల గింజల దిగుబడి వచ్చింది. క్వింటాకు రూ.12,700, బీ, సీ రకానికి రూ.10,900, రూ.10,600 మద్దతు ధర వచ్చింది. కూలీల ఖర్చు ఎక్కువ అయింది. గతేడాది కంటే ఈసారి ఎక్కవ ధర వచ్చినప్పటికీ ఆశించిన మేర దిగుబడి లేక మిగులుబాటు కాలేదు.

\- జె.నారాయణ,గోపిరాజుపల్లి, జనగామ

సగం దిగుబడి కోతులకే..



మూడు చింతచెట్లు సొంతంగా ఉన్నాయి. మొదటి విడతలో ఒక్క చెట్టుకు క్వింటాన్నర దిగుబడి వచ్చింది. మార్కెట్‌కు తీసుకువచ్చి అమ్మితే రూ.9వేల ధర పలుకగా, ఇదే పండు ఒక్కరోజు ముందు రూ.10వేలు పలికింది. క్వింటా చింతగింజలు అమ్ముకుంటే మరో రూ.3వేలు వచ్చాయి. కోతులు చింతకాయలను తెంపి పడేయటంతో సగం దిగుబడి వచ్చింది.

\- దేవరబోయిన ఐలయ్య, సిక్కులోనిగూడెం, జనగామ

ధర పడిపోకుండా చూస్తున్నాం..



జనగామ మార్కెట్‌కు అనేక ప్రాంతాల నుంచి చింతపండు వస్తుంది. ధర పడి పోకుండా పర్యవేక్షణ చేస్తున్నాం. గతేడాది కంటే మంచి రేటు వస్తుంది. వేలం పాట సమయంలో చింతపండు నాణ్యత ఆధారంగా ధర ఇవ్వాలని కోరాం. రైతులకు ధర నచ్చని పక్షంలో బలవంతంగా తీసుకోవద్దు.

\- బనుక శివరాజ్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్

ఆర్‌యూబీ నిర్మాణంపై ఆందోళన



ఆందోళనకారులతో మాట్లాడుతున్న పోలీసులు

రఘునాథపల్లి: నిడిగొండ రైల్వే ట్రాక్ వద్ద కొనసాగుతున్న రోడ్డు అండర్ బ్రిడ్జి (ఆర్‌యూబీ) ఓ వైపు ఇరుకుగా నిర్మాణం చేయడంపై పలు గ్రామాల ప్రజలు మంగళవారం ఆందోళనకు దిగారు. ఫతేషాపూర్ వైపు అండర్‌గ్రౌండ్‌లో 32 ఫీట్ల వెడల్పుతో నిర్మిస్తుండగా, నిడిగొండ వైపు మాత్రం 20 ఫీట్లకే పరిమితం చేయడంపై పతేషాపూర్, ఇబ్రహీంపూర్, లక్ష్మీతండా, రామచంద్రగూడెం, మాధారం గ్రామాలకు చెందిన ప్రజలు పెద్ద సంఖ్యలో ఆర్‌యూబీ వద్దకు తరలి వచ్చి నిరసన చేపట్టారు. స్పందించిన కాంట్రాక్టర్ నిడిగొండ వైపు 24 ఫీట్ల వెడల్పుతో పనులు చేపట్టడంతో నిరసన కార్యక్రమాన్ని విరమించుకున్నారు. ఈ ఆందోళనలో మాజీ సర్పంచ్‌లు గాజులపాటి మహేందర్, ఎండీ హయతలి, శాగ నాగరాజు, ఎండీ షబ్బీర్, గొట్టం కర్ణాకర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, పోకల శ్రీనివాస్, దొరగొల్ల యాదగిరి, మేకల శంకరయ్య, ఎండీ గౌస్, నేతాజీ, వీరోజీ, మేడిపల్లి నరేష్, శ్యామల ర ఘు, లోడె నర్సయ్య, పోతులూరి తదితరులు ఉన్నారు.

ఇంటి నంబర్లు కేటాయించాలి

● సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

జనగామ రూరల్: పట్టణంలోని మూడో విడత ఇందిరమ్మ ఇళ్లకు ఇంటి నంబర్లు కేటాయించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం జనగామ మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట సీపీఎం జనగామ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఎం అనేక పోరాటాలతో ఇల్లు లేని నిరుపేదలకు అధికారులతో స్థలాలను లేఅవుట్ చేయించి అందజేశామన్నారు. ఆ స్థలంలో పేదలు ఇల్లు నిర్మించుకున్నారన్నారు. వాటికి ఇంటి నంబర్లు కేటాయించాలని అధికారులను కోరినా ఫలితం లేదన్నారు. ఇప్పటికైన ఇంటినంబర్లు కేటాయించి, విద్యుత్, తాగునీరు, రోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటు చేయించాలని కమిషనర్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి జోగు ప్రకాష్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఈర్రి అహల్య, బొట్ల శేఖర్, బూడిది గోపి, గణేష్, కళ్యాణం లింగం, నాయకులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

జనగామ రూరల్: నేషనల్ హెల్త్ మిషన్‌లో గత మూడు సంవత్సరాల నుంచి ప్రైమరీ హెల్త్ సెంటర్ స్థాయిలో ప్రజలకు వైద్యసేవలు అందిస్తున్న మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్‌లకు రూ.44 వేల వేతనంతోపాటు ఉద్యోగ భద్రతను కల్పించాలని నేషనల్ హెల్త్ మిషన్ కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా, ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షుడు సి.హెచ్ రాజారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం యూనియన్ జిల్లా అధ్యక్షురాలు జ్యోతి అధ్యక్షతన గబ్బెట గోపాలరెడ్డి భవన్‌లో జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేష్ ఖన్నా మాట్లాడారు. అనంతరం జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కేతవత్ మహేష్ నాయక్, ఉపాధ్యక్షులుగా పులి లావణ్య, బొల్లం జెస్సికా, ప్రధాన కార్యదర్శి కీర్తన, ప్రవళికతోపాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

టెన్త్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

- కలెక్టర్ రిజ్వాన్ బాషా
- జిల్లాలో 41 పరీక్ష కేంద్రాల ఏర్పాటు
- హాజరుకానున్న 6,238 మంది విద్యార్థులు



మాట్లాడుతున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా

జనగామ రూరల్: జిల్లాలో పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని ప్రధాన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్, డీసీపీ రాజ మహేంద్ర నాయక్‌లతో కలిసి టెన్త్ వార్షిక పరీక్షల నిర్వహణపై చీఫ్ సూపరింటెండెంట్‌లు, డిపార్టుమెంటల్ అధికారులు, సంబంధిత జిల్లా అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 21 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు జరిగే పరీక్షలకు 41 సెంటర్లలో 6,238 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారన్నారు. పరీక్ష కేంద్రాల్లో తాగునీరు, బెంచీలు, కుర్చీలు, మూత్రశాలల సౌకర్యం కల్పించాలన్నారు. పోలీస్ ఎస్కార్ట్‌తో ప్రభుత్వ వాహనంలో నిర్దేశించిన ఆయా రూట్లలో మాత్రమే పరీక్ష పేపర్లను ఆయా కేంద్రాలకు తరలించాలన్నారు. విద్యార్థులు తమ సందేహాల నివృత్తికి 6304062768 కంట్రోల్ రూం నంబర్‌లో సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఈఓ రమేష్, డీఎంహెచ్ఓ మల్లికార్జునరావు, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, ఏసీజీఈ రవి కుమార్, డీసీఈబీ అసిస్టెంట్ సెక్రటరీ రామరాజు, జీసీడీఓ గౌసియా బేగం, ఏఎంఓ శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.

దివ్యాంగులను ప్రోత్సహించాలి

దివ్యాంగులను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా అన్నారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలోని ప్రధాన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు పింకేష్ కుమార్‌తో కలిసి దివ్యాంగులకు ఉచిత సహాయ ఉపకరణాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం దివ్యాంగులకు అనేక పథకాలను ప్రవేశపెట్టిందని, దానిలో భాగంగానే ఈ సహాయ ఉపకరణాలను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలోని 66 మంది దివ్యాంగ విద్యార్థులకు అవసరమైన సహాయ ఉపకరణాలను అందించి వారి ఆప్యాయంగా పలకరించి ముచ్చటించారు.

ఏఐతో మెరుగైన విద్యాబోధన



ఏఐ గురించి విద్యార్థులకు వివరిస్తున్న కలెక్టర్

విద్యార్థులు చదువుపై పట్టు సాధించేలా కృత్రిమ మేధ ద్వారా మెరుగైన విద్యాబోధన అందించాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా ఉపాధ్యాయులకు సూచించారు. మంగళవారం మండలంలోని మరిగడి గ్రామ పంచాయతీ పరిధిలో గల ఎంపీపీఎస్ పాఠశాలను ఆయన ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. ఎఫ్ఎల్ఎన్ ఏఎక్స్ఎల్ ల్యాబ్‌ను పరిశీలించి, వెనుకంజలో ఉన్న విద్యార్థులు కృత్రిమ మేథ ద్వారా నేర్చుకుంటున్న తీరును పర్యవేక్షించి ఉపాధ్యాయులకు దిశానిర్దేశం చేశారు. అలాగే మరిగడిలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి పిల్లలకు అందించే ఆహారాన్ని పరిశీలించారు. నాణ్యమైన ఆహారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ జి.శంకర్‌రెడ్డి, జీసీడీఓ గౌసియా బేగం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

‘దేవాదుల’ గట్టెక్కించేనా?

- రాత్రి వరకు కాని మోటార్ మరమ్మతు
- చివరి ఆయకట్టు రైతుల్లో ఆందోళన
- హడావుడిగా సాగిన మంత్రుల పర్యటన
- ‘ధర్మసాగర్ రిజర్వాయర్’ కార్యక్రమం రద్దు
- దేవన్నపేట పంపుహౌస్‌కు హుటాహుటిన అధికారులు



దేవన్నపేట వద్ద అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, చిత్రంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే కడియం శ్రీహరి తదితరులు

సాక్షిప్రతినిధి, వరంగల్/హసన్‌పర్తి/ధర్మసాగర్: వేసవి ఎండల తీవ్రత.. అడుగంటుతున్న భూగర్భ జలాలు.. దీంతో జనగామ, హనుమకొండ జిల్లాల్లోని నాలుగు నియోజకవర్గాల్లో అక్కడక్కడ పంటలు ఎండుతున్నాయి. చేతికందే దశలో దేవాదుల ప్రాజెక్టు పరిధిలో వరి పంటలు దెబ్బతింటున్నాయి. ఈ నేపథ్యంలో ఆ ప్రాజెక్టు కింద 50 నుంచి 60వేల ఎకరాలకు సాగునీరందించేలా దేవాదుల ప్రాజెక్టు మూడవ దశలో భాగంగా దేవన్నపేటలో నిర్మించిన పంప్‌హౌస్ మోటార్లను జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రారంభించేందుకు మంగళవారం సాయంత్రం పంపుహౌజ్‌కు చేరుకున్నారు. కానీ, మోటారు మరమ్మతుకు రావడం, ఆస్ట్రియా నుంచి వచ్చిన బృందం చేపట్టిన రిపేర్లు పూర్తి కాకపోవడంతో మంత్రులు రాత్రి ఎన్ఐటీ గెస్టుహౌస్‌లో ఉన్నారు. అసెంబ్లీలో బుధవారం బడ్జెట్ ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో రాత్రి 11.30 గంటలకు హైదరాబాద్‌కు వెళ్లిపోయారు.

ఫేజ్–3 పనులపైనే దృష్టి...

చేతికందే పంటలను కాపాడేందుకు మూడో ఫేజ్ పనులపై అధికారులు దృష్టి సారించారు. దేవన్నపేట పంపుహౌజ్‌లో ప్రస్తుతం ఒక్కో మోటారు 800 క్యూసెక్కుల నీటిని లిఫ్ట్ చేస్తోంది. ప్రస్తుతం ఇక్కడ మూడు మోటార్లు ఏర్పాటు చేయగా.. అందులో ఒక్కటి ఆన్‌చేసి జనగామ, పాలకుర్తి, స్టేషన్ ఘన్‌పూర్, వర్ధన్నపేట నియోజకవర్గాల్లో సుమారు 60వేల నుంచి 65వేల ఎకరాల వరకు సాగునీరు అందించడంపై దృష్టి పెట్టారు. మంగళవారం రాత్రి వరకు మోటారు మొరాయించడంతో ఈ యాసంగి పంట చేతికందే వరకు నీటి సరఫరా అవుతుందా? అన్న ఆందోళన ఆ నాలుగు నియోజకవర్గాల్లోని రైతుల్లో వ్యక్తమవుతోంది.



దేవాదుల పంప్‌హౌస్‌ను పరిశీలిస్తున్న మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే కడియం శ్రీహరి

హడావుడిగా సాగిన మంత్రుల పర్యటన..

దేవాదుల చివరి ఆయకట్టుకు సాగునీరందించేందుకు యుద్ధప్రాతిపదికన ఖరారైన మంత్రుల టూర్ హడావిడిగా సాగింది. మొదట మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి హైదరాబాద్ నుంచి హెలికాప్టర్ ద్వారా హసన్‌పర్తి మండలం దేవన్నపేటకు పంప్‌హౌస్‌కు చేరుకున్నారు. అక్కడినుంచి ధర్మసాగర్ రిజర్వాయర్‌లో నీరు పంపింగ్ అయ్యేలా మోటార్ ఆన్ చేయాల్సి ఉంది. అనంతరం ధర్మసాగర్ రిజర్వాయర్‌కు చేరుకుని అక్కడ పూజలు చేసి.. మీడియా సమావేశంలో మాట్లాడుతారనేది షెడ్యూల్. కానీ, అనుకున్న ప్రకారం దేవన్నపేటకు మంత్రులు చేరుకున్నప్పటికీ మోటార్ మొరాయించడంతో స్విచాన్ చేయకుండా అక్కడే అధికారులతో సమీక్ష నిర్వహించారు. ధర్మసాగర్ రిజర్వాయర్ వద్ద వేసిన టెంట్లు, కుర్చీల వద్దే ప్రజలు, కార్యకర్తలు ఉండిపోయారు. చివరి నిమిషంలో మీడియా సమావేశం దేవన్నపేటలోనే ఉంటుందనడంతో ధర్మసాగర్ నుంచి దేవన్నపేటకు మీడియాతోపాటు నాయకులు, కార్యకర్తలు, అధికారులు వెళ్లాల్సి వచ్చింది. కాగా దేవన్నపేట పంపుహౌస్ , ధర్మసాగర్ రిజర్వాయర్‌తోపాటు పలుచోట్ల ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలలో సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రుల పక్కన ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, మామిడాల యశస్విని రెడ్డి తదితరుల ఫొటోలు లేకపోవడం చర్చనీయాంశంగా మారింది.

అధికారులపై మంత్రి ఉత్తమ్ ఆగ్రహం

దేవాదుల ప్రాజెక్టు దశలు ఎప్పుడు ప్రారంభమయ్యాయని, ఇతర అంశాలపై మంత్రులు అడిగిన ప్రశ్నలకు నీటిపారుదల శాఖ అధికారుల నుంచి సరైన సమాధానం లేదు. దీంతో వారిపై మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సమీక్షకు సమాచారం లేకుండా ఉత్త చేతులతో వస్తారా అని మండిపడ్డారు. చిన్న చిన్న సమస్యలతో రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి, నీటిపారుదలశాఖ ముఖ్యకార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య, బల్దియా కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే, ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, కుడా చైర్మన్ వెంకట్రామిరెడ్డి, మేయర్ గుండు సుధారాణి, అధికారులు పాల్గొన్నారు.

రైతు ఉత్పత్తి సంస్థలతోనే బలోపేతం

● నాబార్డు రీజినల్ ఆఫీస్ అసిస్టెంట్ మేనేజర్ వినోద్ దేశ్‌ముఖ్



సమావేశంలో మాట్లాడుతున్న వినోద్ దేశ్‌ముఖ్

చిల్పూరు: రైతు ఉత్పత్తి సంస్థలతోనే రైతులను బలోపేతం చేయాలని నాబార్డు రీజినల్ ఆఫీస్ అసిస్టెంట్ మేనేజర్ వినోద్ దేశ్‌ముఖ్ అన్నారు. మండలంలోని రాజవరం గ్రామంలో నాబార్డు సౌజన్యంతో జనవికాస గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో 522 మంది రైతులతో ఏర్పాటు చేసిన రాజవరం రైతు ఉత్పత్తి దారుల సంస్థను మంగళవారం ఆయన సందర్శించారు. ముందుగా రికార్డులను పరిశీలించారు. ఏపీఓ చేస్తున్న బిజినెస్ గురించి సంస్థ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జనవికాస గ్రామీణ అభివృద్ధి సంస్థ సీఈఓ పెండ్లి సంపత్‌కుమార్, సంస్థ చైర్మన్ కాల్వ కృష్ణారెడ్డి, డైరెక్టర్లు కుమారస్వామి, రమాదేవి, గట్టయ్య, ఫిరోజ్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఇంటర్ పరీక్షలు

జనగామ రూరల్: జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలు కొనసాగుతున్నాయి. మంగళవారం నిర్వహించిన ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 101 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని డీఐఈఓ కె.జితేందర్ రెడ్డి తెలిపారు. జనగామలోని పరీక్ష కేంద్రాలను డీఐఈఓ సందర్శించారు.

బార్ అసోసియేషన్ ఎన్నికల షెడ్యూల్ విడుదల

జనగామ రూరల్: జనగామ బార్ అసోసియేషన్ ఎన్నికల షెడ్యూల్డ్‌ను మంగళవారం ఎన్నికల అధికారి శ్రీరామ్ శ్రీనివాస్ విడుదల చేశారు. ఈ మేరకు బుధవారం, గురువారం నామినేషన్ల స్వీకరణ, 21న స్క్రూటినీ, అభ్యర్థులు జాబితా విడుదల, 24న నామినేషన్ ఉపసంహరణ, అదేరోజు సాయంత్రం ఫైనల్ లిస్టు విడుదల అవుతుందన్నారు. 27న పోలింగ్, సాయంత్రం ఫలితాల వెల్లడి ఉంటుందన్నారు. అధ్యక్షుడికి నామినేషన్ దరావత్తు రూ.10వేలు, ఉపాధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శికి రూ.5వేలు ఉంటుందన్నారు.

15 మంది ట్రేడర్లకు నోటీసులు



మాట్లాడుతున్న ఏఎంసీ చైర్మన్, పక్కన డీఎంఓ నరేంద్ర

జనగామ: జనగామ మార్కెట్ అధికారులు ఫీజు వసూళ్లపై ప్రత్యేక ఫోకస్ సారించారు. మొండి బకాయిదారులపై నోటీసు అస్త్రాలతో రంగంలోకి దిగారు. ఈ నెల 31వ తేదీ వరకు చివరి అవకాశం ఇచ్చిన అధికారులు... ఆ తర్వాత 1 శాతం ఫీజుపై 12 శాతం వడ్డీ (పెనాల్టీ) వసూలు చేయనున్నారు. అప్పటికీ బకాయిలపై స్పందించకుంటే లైసెన్స్ రద్దుతో పాటు రెవెన్యూ రికవరీ యాక్టు సైతం అమలు చేసేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. జనగామ వ్యవసాయ మార్కెట్ పరిధిలో 54 ట్రేడ్ లైసెన్స్‌లు ఉన్నాయి. ఇందులో 20 మంది వరకు మార్కెట్ పరిధిలో కొనుగోళ్లు చేస్తుండగా, మిగతా ట్రేడర్లు రైస్‌మిల్లు వద్దనే సరుకులను తీసుకుంటారు. సుమారు 15 మంది ట్రేడర్లు రూ.30 లక్షలకు పైగా ఫీజు బకాయి ఉన్నారు. వందశాతం ఫీజు వసూళ్లే లక్ష్యంగా మార్కెట్ అధికారులు నడుంబిగించారు. 15 మందికి నోటీసులు జారీ చేసి, ఈ నెల 31వ తేదీ లోపు బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. ఈ విషయమై మార్కెట్ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్, డీఎంఓ, ఇన్‌చార్జ్ ప్రత్యేక శ్రేణి కార్యదర్శి నరేంద్ర మాట్లాడుతూ 15 మంది ట్రేడర్లకు నోటీసులు జారీ చేసినట్లు స్పష్టం చేశారు.

వినియోగదారులతో సీఎండీ ముఖాముఖి



హన్మకొండ: విద్యుత్ వినియోగదారులతో టీజీ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి ముఖాముఖి నిర్వహించారు. మంగళవారం హనుమకొండలోని ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం నుంచి విద్యుత్ వినియోగదారులతో ఫోన్ ద్వారా నేరుగా మాట్లాడారు. నూతనంగా సర్వీస్‌లు పొందిన గృహ, వ్యవసాయ, వాణిజ్య, పరిశ్రమల వినియోగాదారులకు స్వయంగా ఫోన్ చేసి వారితో సంభాషించారు. సర్వీస్ మంజూరు జరుగుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. కొత్త సర్వీస్ మంజూరులో జాప్యం జరిగిందా? కాల పరిమితికి లోబడి మంజూరు చేశారా? విద్యుత్ అధికారులు నిబంధనల మేరకు మంజూరు చేస్తున్నారా? అధికారులు ఎలా పని చేస్తున్నారు? వంటి విషయాలను అడిగి తెలుసుకున్నారు. దీంతో పాటు ఇతర సేవలు ఏ విధంగా ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు. అనంతరం వరుణ్ రెడ్డి మాట్లాడుతూ మెరుగైన, నాణ్యమైన సేవలు అందించడానికి వినియోగదారుల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించేందుకు నేరుగా వారితో మాట్లాడాన్నారు. ఫీడ్ బ్యాక్ తీసుకోవడం, అభిప్రాయాలు తెలుసుకోవడం ద్వారా అవసరమైన మార్పులు తీసుకొచ్చే అవకాశముందన్నారు. అదే విధంగా సత్సంబంధాలు పెరుగుతాయన్నారు. వినియోగదారుల్లో కంపెనీపై విశ్వాసం, సేవల పట్ల నమ్మకం కలుగుతుందన్నారు. వినియోగాదారులకు నాణ్యమైన సేవలు అందించడానికి ప్రతీ ఉద్యోగి నిబద్ధతో పనిచేస్తున్నారని పేర్కొన్నారు.

సినీఫక్కీలో హరిబాబు కోర్టుకు..

న్యాయస్థానం వెనుక గేటు నుంచి రిమాండ్‌కు తరలింపు

- హరిబాబుతోసహా మరో ఇద్దరు సహాయకుల అరెస్ట్, కోర్టులో హాజరు
- కోర్టుకు వచ్చిన రాజలింగమూర్తి భార్య సరళ, బంధువులు
- నిందితుడిని చూపించాలని డిమాండ్
- అక్కడే ఉన్న బీఆర్ఎస్ నాయకులను నిలదీత .. అరగంటపాటు ఉద్రిక్తత
- హరిబాబు పరారీకి సహకరించిన ఇద్దరికి బెయిల్ మంజూరు?



కోర్టు వద్ద బీఆర్ఎస్ నాయకులను నిలదీస్తున్న రాజలింగమూర్తి భార్య సరళ

భూపాలపల్లి : సామాజిక కార్యకర్త నాగవెల్లి రాజలింగమూర్తి హత్య కేసులో నిందితుడు హరిబాబు, అతడి పరారీకి సహకరించిన మరో ఇద్దరిని పోలీసులు కోర్టుకు తీసుకొచ్చి రిమాండ్‌కు తరలించారు. కోర్టుకు రాజలింగమూర్తి భార్య సరళ, బంధువులు రావడం.. అక్కడే కొంతమంది బీఆర్ఎస్ నాయకులు కూడా ఉండడంతో సుమారు అరగంటపాటు ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

ఉదయం 9 గంటలకే కోర్టుకు..

రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన భూపాలపల్లి పట్టణానికి చెందిన రాజలింగమూర్తి గత నెల 19న హత్యకు గురి కాగా, ఈ హత్య కేసులో ఏ–8గా ఉన్న నిందితుడు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కొత్త హరిబాబు, అతడి పరారీకి సహకరించి, వెంటే ఉన్న ములుగు జిల్లాకు చెందిన వట్టే రమణయ్య, రమను ఏ–11, ఏ–12గా చేర్చిన భూపాలపల్లి పోలీసులు మంగళవారం ఉదయం 9 గంటలకే జిల్లా కేంద్రంలోని ప్రిన్సిపల్ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టుకు తీసుకొచ్చారు. కోర్టులో హాజరు పర్చగా నిందితులకు జడ్జి ఎస్. రాంచందర్‌రావు 14 రోజుల రిమాండ్ విధించారు. దీంతో పోలీసులు నిందితులను ఖమ్మం జైలుకు తరలించారు.

కోర్టు వద్ద తీవ్ర ఉద్రిక్తత..

కోర్టు వద్ద ఘర్షణ చోటు చేసుకునే అవకాశం ఉందని భావించిన పోలీసులు సినీ ఫక్కీలో హరిబాబును రిమాండ్‌కు తరలించారు. రమణయ్య, రమను కోర్టు ముందు గేటు ద్వారా తీసుకెళ్లారు. హరిబాబును మాత్రం వెనుక గేటు నుంచి తీసుకెళ్లి పోలీసు వాహనంలో రిమాండ్‌కు తరలించారు. విషయాన్ని గమనించిన సరళ, ఆమె బంధువులు.. హరిబాబును తమకు చూపించాలని పోలీసులను డిమాండ్ చేశారు. అక్కడే ఉన్న బీఆర్ఎస్ నాయకులను సరళ నిలదీసింది.

ఏ–11, ఏ–12కు బెయిల్?

హరిబాబు పరారీకి సహకరించి, అతడి వెంట ఉన్న రమణయ్య, రమకు కోర్టు బెయిల్ మంజూరు చేసినట్లు తెలిసింది. జమానతులు సమర్పిస్తే నేడు బెయిల్ రానున్నట్లు సమాచారం.

ఆరుగురు నిందితుల కస్టడీకి పోలీసుల అప్పీలు..

హత్య కేసులో ఏ–1గా ఉన్న రేణికుంట్ల సంజీవ్, ఏ–2 పింగిలి సేమంత్, ఏ–3 మోరె కుమార్, ఏ–4 కొత్తూరి కిరణ్, ఏ–6 దాసారపు క్రిష్ణ, ఏ–8 కొత్త హరిబాబును విచారణ నిమిత్తం ఏడు రోజుల కస్టడీ కోసం పోలీసులు కోర్టులో నేడు పిటిషన్ దాఖలు చేయనున్నట్లు సమాచారం.

హరిబాబు బెయిల్ పిటిషన్‌పై నేడు హైకోర్టులో విచారణ..

కొత్త హరిబాబు పరారీలో ఉండి ఈ నెల 4వ తేదీన హైకోర్టును ఆశ్రయించి ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేశాడు. మూడు, నాలుగుసార్లు వాదనలు జరగగా విచారణ మంగళవారం(నిన్న)కు వాయిదా పడగా అదే రోజున హరిబాబును పోలీసులు కోర్టు ముందు హాజరుపరిచారు. దీంతో హరిబాబు తరపున లాయర్ ముందస్తుకు బదులు సాధారణ బెయిల్ కోసం పిటిషన్ దాఖలు చేయగా బుధవారం విచారణ జరగనున్నట్లు సమాచారం.



హరిబాబును ఖమ్మం జైలుకు తరలిస్తున్న పోలీసులు (ఎడమ నుంచి రెండో వ్యక్తి)

ముగ్గురి అరెస్ట్..

రాజలింగమూర్తి హత్య కేసులో ప్రధాన నిందితుడు కొత్త హరిబాబుతో పాటు, అతడు పారిపోవడానికి సహకరించిన మరో ఇద్దరిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచినట్లు సీఐ డి. నరేశ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ములుగు జిల్లాకు చెందిన వట్టే రమణయ్య, రమ.. హరిబాబు పారిపోవడానికి సహకరించారని, ముగ్గురిని ఒకే దగ్గర అదుపులోకి తీసుకున్నట్లు ప్రకటించారు.

భారత రాజ్యాంగం.. సామాజిక అభ్యున్నతికి దోహదం



మాట్లాడుతున్న ఆంధ్రప్రదేశ్ హైకోర్టు పూర్వజడ్జి జస్టిస్ పీఎస్ నారాయణ



మాట్లాడుతున్న జస్టిస్ చంద్రయ్య



మాట్లాడుతున్న మహ్మద్ రియాజ్

- ఏపీ హైకోర్టు పూర్వ న్యాయమూర్తి జస్టిస్ నారాయణ
- కేయూలో జాతీయ సదస్సు ప్రారంభం

కేయూ క్యాంపస్ : భారత రాజ్యాంగం సామాజిక వ్యవస్థ అభ్యున్నతికి దోహదపడుతున్న విలువైన డాక్యుమెంట్ అని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు పూర్వ న్యాయమూర్తి జస్టిస్ పీఎస్ నారాయణ అన్నారు. కాకతీయ విశ్వవిద్యాలయంలోని ఎస్సీ, ఎస్టీ సెల్ ఆధ్వర్యంలో '75 ఏళ్ల భారత రాజ్యాంగం మైలురాయి.. సమస్యలు– సవాళ్లు' అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు మంగళవారం సెనేట్ హాల్‌లో నిర్వహించారు. ఈ సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. భారతీయ సమాజం విభిన్న సంస్కృతుల జాతుల కలయిక అని, ఇండియాలో నివసించే వ్యక్తులందరూ రాజ్యాంగం పరిధిలో జీవిస్తున్నారన్నారు. సమసమాజ స్థాపనకు భారత రాజ్యాంగ వ్యవస్థ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. సెక్యులర్ భావాలతో రాజ్యాంగంలో పేర్కొన్న ప్రతీ ఆర్టికల్ దేశ ప్రజలందరికీ ఉపయోగపడుతుందన్నారు.

మానవ అభివృద్ధికి విద్య దోహదం..

మానవ అభివృద్ధికి విద్య ఎంతో దోదపడుతుందని తెలంగాణ హైకోర్టు పూర్వ న్యాయమూర్తి జస్టిస్ చంద్రయ్య అన్నారు. బడుగు, బలహీన, వెనుకబడిన వర్గాల అభివృద్ధికి రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లు సమాజ అభ్యున్నతికి దోహదపడుతున్నాయన్నారు. భగవద్గీత, వేదాలు ఉపనిషత్తులు, అన్ని గ్రంథాలతోపాటు రాజ్యాంగాన్ని కూడా ప్రతి ఒక్కరూ చదవాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యా వ్యవస్థను బలోపేతం చేసే దిశగా అధిక నిధులు కేటాయించాలన్నారు. విద్య, వైద్యం ఉచితంగా అందించాల్సిన అవసరం ఉందన్నారు.

ప్రత్యామ్నాయ రాజకీయాలు రావాలి..

ప్రస్తుత రాజకీయ వ్యవస్థలో విలువలు లేవని, దీనివల్ల ప్రజలకు ఎలాంటి మేలు జరగడం లేదని, అందుకే ప్రత్యామ్నాయ రాజకీయాలు రావాలని కేయూ మాజీ రిజిస్ట్రార్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. దేశంలో నిజాయితీ గల రాజకీయ వ్యవస్థ లేకుండా పోయిందన్నారు.

సెక్యులర్ భావాలు కలిగిన వ్యవస్థ..

ప్రపంచంలోనే గొప్ప రాజ్యాంగ వ్యవస్థను కలిగిన భారతదేశంలో భిన్న సంస్కృతులు, ఆచార వ్యవహారాలు ఉన్నాయని, ముఖ్యంగా సెక్యులర్ భావాలతో కలిగిన వ్యవస్థ ఉందని, దీనిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని రాష్ట్ర గ్రంథాలయాల సంస్థ చైర్మన్ మహ్మద్ రియాజ్ అన్నారు. తెలంగాణలో రేవంత్‌రెడ్డి ప్రజాపాలనలో అనేక సమస్యల పరిష్కారానికి కృషి జరుగుతోందన్నారు. యూనివర్సిటీల్లో కూడా టీచింగ్ ఫ్యాకల్టీని నియమించబోతున్నారని వెల్లడించారు. అనంతరం కేయూ వీసీ కె. ప్రతాప్‌రెడ్డి, కేయూ ఎస్సీ,ఎస్టీ సెల్ డైరెక్టర్, సెమినార్ డైరెక్టర్ తుమ్మల రాజమణి, ఓయూ 'లా' కాలేజీ మాజీ ప్రిన్సిపాల్ ద్వారకానాథ్ మాట్లాడారు. కేయూ రిజిస్ట్రార్ రామచంద్రం, సైన్స్ కోర్సుల డైరెక్టర్ బి. వెంకటగోపినాథ్, డాక్టర్ మేఘనరావు, డాక్టర్ ప్రగతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూ నిర్వాసితులకు న్యాయం చేస్తాం

- శరవేగంగా రన్‌వే భూ సేకరణ పనులు
- వరంగల్ ఆర్డీఓ సత్యపాల్‌రెడ్డి
- నక్కలపల్లి, గాడిపల్లిలో వ్యవసాయ బావులు, బోర్ల పరిశీలన



నక్కలపల్లి,గాడిపల్లి గ్రామాల్లో రన్‌వే భూముల్లో వ్యవసాయ బావులు, బోర్లను పరిశీలిస్తున్న ఆర్డీఓ సత్యపాల్‌రెడ్డి

ఖిలా వరంగల్ : మామునూరు ఎయిర్‌పోర్ట్ భూ నిర్వాసితులకు న్యాయం జరిగేలా కృషి చేస్తున్నామని వరంగల్ ఆర్డీఓ సత్యపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం వరంగల్ నక్కలపల్లి , గాడిపల్లి గ్రామాల్లో తహసీల్దార్ బండి నాగేశ్వర్‌రావు, ఆర్‌అండ్‌బీ, హార్టికల్చర్, ఇరిగేషన్ అధికారులు, రైతులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా సర్వే ద్వారా గుర్తించిన 253 ఎకరాల భూములతోపాటు వ్యవసాయ బావులు, బోర్లును పరిశీలించారు. బోర్లు, బావుల నిర్మాణానికి అయ్యే వ్యయాన్ని అంచనా వేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. అనంతరం ఆర్డీఓ మాట్లాడుతూ ప్రభుత్వ ఉత్వర్వుల ప్రకారం విమానాశ్రయం రన్‌వే విస్తీర్ణం కోసం 253 ఎకరాల భూమిని సేకరించే పనిలో ఉన్నామని, సర్వే ద్వారా నక్కలపల్లి, గాడిపల్లి గ్రామాల్లో 253 ఎకరాలను గుర్తించమన్నారు. భూమి విలువతోపాటు బావులు, బోర్లు విలువను సైతం పరిహారంలో చెల్లిస్తామని తెలిపారు. ప్రతీ రైతుకు న్యాయం జరిగేలా కృషి చేస్తున్నామని, త్వరలో నివేదిక తయారు చేసి కలెక్టర్‌కు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మండల ఆర్ఐ ఆనంద్ కుమార్, సర్వేయర్ రజిత, ఇతర శాఖల సిబ్బంది, భూ నిర్వాసితులు పాల్గొన్నారు.

లైంగిక దాడి కేసులో నిందితుడికి పదేళ్ల జైలు



నిందితుడు నరేశ్

కాటారం: మహాముత్తారం మండలానికి చెందిన ఓ వివాహితపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో నిందితుడికి పది సంవత్సరాల ఆరు నెలల కఠిన జైలు శిక్షతో పాటు రూ.1500 జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి నారాయణబాబు మంగళవారం తీర్పు వెలువరించారు. మహాముత్తారం ఎస్సై మహేందర్‌కుమార్ కథనం ప్రకారం.. మహాముత్తారం మండలం మహబూబ్‌పల్లికి చెందిన అర్నేని నరేశ్ 2015లో ఓ వివాహిత రాత్రి ఒంటరిగా ఇంట్లో నిద్రిస్తుండగా ఆమెపై లైంగికదాడికి పాల్పడ్డాడు. సదరు మహిళ కేకలు వేయగా చుట్టు పక్కల వారు రావడంతో నరేశ్ పారిపోయాడు. మరుసటి రోజు వివాహిత ఈ విషయం తన భర్తకు చెప్పడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్సై వెంకటేశ్వరరావు.. నరేశ్‌పై కేసు నమోదు చేయగా అప్పటి సీఐ మహేశ్ చార్జ్‌షీట్ దాఖలు చేశారు. కొన్ని రోజులుగా కోర్టులో విచారణ కొనసాగగా డీఎస్పీ గడ్డం రామ్మోహన్‌రెడ్డి, సీఐ నాగార్జునరావు, ఎస్సై మహేందర్‌కుమార్ ఆధ్వర్యంలో సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. విచారణలో భాగంగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీనివాస్ వాదనలు వినిపించగా నేరం రుజువైంది. దీంతో నరేశ్‌కు పదేళ్ల ఆరు నెలల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.1500 జరిమాన విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి నారాయణబాబు తీర్పు వెల్లడించారు. నిందితుడికి శిక్షపడేలా సమర్థవంతంగా విధులు నిర్వర్తించిన డీఎస్పీ, సీఐ, ఎస్సైతో పాటు సాక్షులను సకాలంలో ప్రవేశపెట్టిన కోర్టు సిబ్బందిని ఎస్పీ కిరణ్‌ఖరే అభినందించారు.

హత్యాయత్నం కేసులో భర్తకు ఐదేళ్లు..

మహబూబాబాద్ రూరల్ : భార్యను అదనపు కట్నం కోసం వేధించడంతోపాటు ఆమెను హత్యచేయాలని ప్రయత్నించిన భర్తకు 5 సంవత్సరాల జైలు శిక్ష, రూ.7 వేలు జరిమానా విధిస్తూ మహబూబాబాద్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి సి.సురేశ్ మంగళవారం తీర్పు వెలువరించారు. కోర్టు డ్యూటీ అధికారి, హెడ్ కానిస్టేబుల్ నెలకుర్తి అశోక్ రెడ్డి కథనం ప్రకారం.. మహబూబాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గడ్డిగూడెం తండా గ్రామానికి చెందిన ధరావత్ రవికి మానుకోట జిల్లా కేంద్రంలోని శిఖార్‌ఖానా గడ్డకు చెందిన భవానితో 2017లో వివాహం జరిగింది. ఈ దంపతులకు ఆరు సంవత్సరాల కుమార్తె మహిమ ఉంది. భవానీని రవి, అతడి తల్లిదండ్రులు కాంతి, ఉమ్లా, ఆడపడుచు దంపతులు లక్ష్మి, విష్ణు అదనపు కట్నం తీసుకురావాలని వేధింపులకు గురిచేశారు. భర్త రవి ఉరేసి చంపే ప్రయత్నం చేయగా భవాని 2021 ఫిబ్రవరి 22వ తేదీన రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. అప్పటి ఎస్సై చీర రమేశ్ బాబు కేసు నమోదు చేయగా విచారణ జరిపి అప్పటి ఎస్సై సి.హెచ్.నగేశ్ కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్ పక్షాన అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్లు సంతోషిణి, గణేశ్ ఆనంద్ కోర్టులో వాదనలు వినిపించగా ప్రస్తుత రూరల్ సీఐ సర్వయ్య, ఎస్సై దీపిక ఆధ్వర్యంలో కోర్టు డ్యూటీ అధికారి అశోక్‌రెడ్డి సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. వాదనలు విన్న అసిస్టెంట్ సెషన్స్ జడ్జి సి.సురేశ్.. రవికి ఐదేళ్ల జైలు శిక్ష, రూ.7 వేలు జరిమానా జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు.

ప్రణాళిక ప్రకారం చదివితేనే విజయం

- గ్రూప్–1 టాపర్ తేజస్విని రెడ్డి



మాట్లాడుతున్న గ్రూప్-1 టాపర్ తేజస్విని రెడ్డి

విద్యారణ్యపురి: ప్రణాళిక ప్రకారం కష్టపడి చదివితేనే పోటీ పరీక్షల్లో విజయం సాధ్యమని గ్రూప్ –1 టాపర్ జిన్నా తేజస్విని రెడ్డి అన్నారు. మంగళవారం హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కెరీర్ గైడెన్స్ కౌన్సెలింగ్ సెల్ ఆధ్వర్యంలో విద్యార్థులతో నిర్వహించిన సమావేశంలో తేజస్వినిరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సరైన ప్రణాళికతో సొంతంగా నోట్స్ రాసుకోవాలన్నారు. పోటీ పరీక్షల్లో తమకు ఏ సబ్జెక్ట్‌పై ఆసక్తి ఉందో దానిపైపట్టు సాధించేలా అందుకు సంబంధించిన పుస్తకాలు చదవవాలన్నారు. శాస్త్ర,సాంకేతిక అంశాలపై శిక్షణ నిపుణలు చల్లా నారాయణరెడ్డి, ఆ కళాశాల ప్రిన్సిపాల్ జి. రాజారెడ్డి, వైస్‌ప్రిన్సిపాల్ కె. రజనీలత, స్టాఫ్‌సెక్రటరీ ఎం. రవికుమార్,కెరీర్ అండ్ గైడెన్స్‌సెల్ కోఆర్డినేటర్ బి.కవిత, డాక్టర్ చిన్నా మాట్లాడారు. అనంతరం తేజస్వినిరెడ్డిని ప్రిన్సిపాల్ రాజారెడ్డి ఇతర అధ్యాపకులు సన్మానించారు.

విద్యుత్ మోటారు ఆన్ చేస్తూ.. మృత్యుఒడికి

- షాక్‌కు గురై రైతు మృతి
- కొండపర్తిలో ఘటన



రమేశ్(ఫైల్)

ఐనవోలు: విద్యుత్ మోటారు ఆన్ చేస్తున్న క్రమంలో షాక్‌కు గురై ఓ రైతు మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని కొండపర్తిలో చోటు చేసుకుంది. ఎస్సై పస్తం శ్రీనివాస్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బాల్నె రమేశ్ (45) వ్యవసాయంతో పాటు కులవృత్తి (గౌడ) కల్లు తీస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. రోజు మాదిరిగానే వరి పంటకు నీరు పారించడానికి మంగళవారం ఉదయం తన వ్యవసాయ బావి వద్దకు వెళ్లాడు. ఈ క్రమంలో స్టార్టర్ ద్వారా వ్యవసాయ మోటారు ఆన్ ఆన్ చేస్తుండగా ఎడమ చేతికి విద్యుత్ తీగ తగిలి షాక్‌కు గురై పక్కనే ఉన్న నీటి కాల్వలో పడి అక్కడికక్కడే మృతిచెందాడు. చుట్టుపక్కల రైతులు గమనించి మృతుడి భార్య, పోలీసులకు సమాచారం అందించారు. దీంతో వారు హుటాహుటిన ఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. తన భర్త మృతి విషయంలో ఎవరిపై ఎలాంటి అనుమానం లేదని మృతుడి భార్య శోభారాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి



రాజా,ఉదయ్ కిరణ్ మృతదేహాలు

వెంకటాపురం(కె): రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. ఈఘటన మంగళవారం రాత్రి మండల కేంద్రంలోని దుర్గమ్మ గుడి సెంటర్‌లో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన రాజా(58) దుర్గమ్మ గుడి సెంటర్ నుంచి నడుచుకుంటూ అంబేడ్కర్ సెంటర్ వైపునకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం నవాబ్ పేటకు చెందిన ఉదయ్ కిరణ్ (30) ద్విచక్రవాహనంపై వేగంగా వస్తూ రాజాను ఢీకొన్నాడు. దీంతో రాజా అక్కడికక్కడే మృతి చెందాడు. అలాగే, ద్విచక్రవాహనం అదుపు తప్పి పల్టీలు కొట్టి కిందపడడంతో ఉదయ్ కిరణ్ కూడా అక్కడికక్కడే మృతి చెందాడు.

సాంకేతిక లోపంతో నిలిచిన గూడ్స్..

- 2 గంటల పాటు ఆగిన పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లు, ప్యాసింజర్లు
- తీవ్ర అసౌకర్యానికి గురైన ప్రయాణికులు



డోర్నకల్‌లో నిలిచిన రైళ్లు

డోర్నకల్/గార్ల: డోర్నకల్, మహబూబాబాద్ రైల్వే స్టేషన్ల మధ్య గూడ్స్ ఇంజిన్‌లో సాంకేతిక లోపం తలెత్తి మెయిన్ లైన్‌లో నిలిచింది. దీంతో మంగళవారం పలు రైళ్ల రాకపోకలకు అంతరాయం కలిగింది. ఉదయం 6 గంటల సమయంలో బొగ్గు లోడ్‌తో వరంగల్ వైపునకు వెళ్తున్న గూడ్స్ ఇంజిన్‌లో సాంకేతిక లోపం తలెత్తి నిలిచింది. దీంతో డోర్నకల్‌లో కాకతీయ రైలు 2.10 గంటల వరకు నిలిచింది. గుండ్రాతిమడుగులో తమిళనాడు ఎక్స్‌ప్రెస్ 2.20 గంటలు, గార్లలో ఏపీ ఎక్స్‌ప్రెస్ 2.10 గంటల వరకు నిలిచిపోగా కోణార్క్ ఎక్స్‌ప్రెస్ డోర్నకల్ అవుట్ సిగ్నల్ వద్ద గంట పాటు, సింగరేణి ఫాస్ట్ ప్యాసింజర్ పోచారం రైల్వే స్టేషన్‌లో రెండు గంటల పాటు నిలిచాయి. మహబూబాబాద్ వైపు నుంచి రిలీఫ్ రైలింజన్ వచ్చి గూడ్స్‌ను మహబూబాబాద్‌కు తరలించిన అనంతరం రైళ్ల రాకపోకలను పునరుద్ధరించారు. రెండు గంటలకు పైగా రైళ్లు నిలవడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

బ్రిడ్జిపై స్తంభించిన రాకపోకలు..

డోర్నకల్: స్థానిక రైల్వే స్టేషన్‌లోని ఫుట్‌ఓవర్ బ్రిడ్జిపై మంగళవారం కొద్దిసేపు రాకపోకలు స్తంభించాయి. ఉదయం సింగరేణి, శాతవాహన రైళ్లు ఆలస్యంగా నడవడం, మహారాష్ట్రకు వెళ్తున్న కూలీలు బ్రిడ్జిపై తమ సామాన్లతో కూర్చోవడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. దీంతో ఆర్‌పీఎఫ్ సిబ్బంది స్పందించి బ్రిడ్జికి ఇరుపక్కలా కూర్చున్న కూలీలను ప్లాట్‌ఫామ్‌లపైకి తరలించి రాకపోకలను పునరుద్ధరించారు.

బాలికలే టార్గెట్



నిందితుల అరెస్ట్ చూపుతున్న సీపీ సన్‌ప్రీత్‌సింగ్

బాలికతో వ్యభిచారానికి యత్నం

- అదృశ్యం కేసుతో బయటపడిన వ్యవహారం
- నిందితులంతా పాత నేరస్తులే
- నిందితురాలే.. ఓ బాధితురాలు
- వివరాలు వెల్లడించిన సీపీ సన్‌ప్రీత్‌సింగ్



నిందితులనుంచి స్వాధీనం చేసుకున్న కారు

వరంగల్ క్రైం: నగరంలో ఓ బాలికను అపహరించి అత్యాచారానికి పాల్పడిన అనంతరం వ్యభిచారం చేయించేందుకు యత్నిస్తున్న ఆరుగురు సభ్యుల ముఠాను అరెస్ట్ చేసినట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్ తెలిపారు. మంగళవారం పోలీస్ కమిషనరేట్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో సీపీ సన్‌ప్రీత్‌సింగ్ వివరాలు వెల్లడించారు. ఈ కేసులో బాలికతో సహా ఓ మహిళ, నలుగురు వ్యక్తులను మిల్స్‌కాలనీ పోలీసులు అరెస్ట్ చేసినట్లు తెలిపారు. నిందితులనుంచి 1.800 కిలోల గంజాయి, కారు, రూ.75వేల నగదు, నాలుగు సెల్‌ఫోన్లతోపాటు ప్రధాన నిందితురాలి ఇంటి వద్ద భారీస్థాయిలో కండోమ్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

నిందితులు వీరే...

హనుమకొండ జిల్లా, దామెర మండలం ల్యాదెళ్ల గ్రామానికి చెందిన ముస్కు లత, ఓ బాలిక, వరంగల్ శంభునిపేటకు చెందిన అబ్దుల్ అఫ్నాన్, షేక్‌సైలాని బాబా, మహ్మద్ అల్తాఫ్, మీర్జా ఫైజ్ బేగ్ అలియాస్ వదూద్‌లు.

అదృశ్యం కేసు నమోదుతో..

ఈ నెల 11న మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్‌లో ఓ బాలిక కనిపించడం లేదని వచ్చిన ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సదరు బాలికను ములుగు రోడ్డు వద్ద గుర్తించి సంరక్షణకు తీసుకుని విచారించారు. తనను కొంతమంది వ్యక్తులు అపహరించి, గంజాయి తాగించిన అనంతరం అత్యాచారానికి పాల్పడినట్లు బాలిక చెప్పింది. దీంతో అప్రమత్తమైన పోలీసులు సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా పర్యవేక్షణలో వరంగల్ ఏసీపీ ఆధ్వర్యంలో మూడు ప్రత్యేక దర్యాప్తు బృందాలను ఏర్పాటు చేసి నిందితులను పట్టుకున్నారు. ఈ వ్యవహారంలో కొత్త విషయాలు వెలుగులోకి వచ్చాయి. ప్రధాన నిందితురాలైన ముస్కు లత, ల్యాదెళ్ల గ్రామంలో వ్యభిచార వృత్తిని కొనసాగిస్తూ, తల్లిదండ్రులు మరణించిన మరో మైనర్ నిందితురాలికి తన ఇంటిలోనే ఆశ్రయం కల్పించింది. లత తన వ్యభిచార వృత్తిలో కొత్త మహిళలు, బాలికలను తీసుకురావడం ద్వారా పెద్ద మొత్తంలో డబ్బులు వస్తాయని, దానిలో నీకు కొంత ఇస్తానని తన ఇంట్లో ఆశ్రయం కల్పించిన బాలిక(ఈమె కూడా నిందితురాలే)కు ఆశ చూపింది. ఇందుకు ఆ బాలిక సిద్ధపడి ఇన్‌స్టాగామ్ ద్వారా ఇంకో బాలికతో పరిచయం పెంచుకుంది. ఈ బాలిక స్కూల్‌కు వెళ్లే సమయంలో మైనర్ నిందితురాలు తన ప్రియుడైన అబ్దుల్ ఆఫ్నాన్‌తో ఆ బాలికను కలిసి బయటకు తీసుకెళ్లి మద్యం, గంజాయిని తాగడం అలవాటు చేశారు. వీరిపై ఆ బాలికకు మరింత నమ్మకం కలిగేందుకు షాపింగ్ మాల్స్‌లో కొత్త దుస్తులు ఇప్పించారు. బాధిత బాలిక వీరిని నమ్మి ఈ నెల 11న మైనర్ అయిన నిందితురాలు తన ప్రియుడుతోపాటు మరో ఇద్దరు షేక్‌సైలాని బాబా, మహ్మద్ అల్తాఫ్‌లతో కలిసి కారులో బయలుదేరి మీర్జా ఫైజ్ బేగ్ వద్ద గంజాయి కొనుగోలు చేశారు. నర్సంపేట శివారు ప్రాంతంలో నిందితుల్లో ఒకడైన షేక్‌సైలానీ బాబాకు చెందిన ఓ పురాతన ఇంటిలో బాధిత బాలికను తీసుకెళ్లి గంజాయి తాగించారు. అనంతరం షేక్ సైలానీ బాబా ఆ బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు. అనంతరం బాలికను 'నువ్వు రేపటి నుంచి మేము చెప్పినట్లుగా వినాలి.. లేకుంటే గంజాయి తాగుతుండగా అత్యాచారం చేసి సెల్‌ఫోన్‌లో చిత్రీకరించాం.. ఈ వీడియోను బయట పెడతాం' అని బెదిరించి ములుగు రోడ్డు వద్ద బాలికను వదిలి అక్కడినుంచి పారిపోయారు. బాలిక చెప్పిన వివరాల ప్రకారం నిందితులను పట్టుకుని విచారించగా నేరం అంగీకరించినట్లు సీపీ సన్‌ప్రీత్‌సింగ్ తెలిపారు.

అధికారులకు అభినందనలు..

నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా, వరంగల్ ఏసీపీ నందిరాం నాయక్, మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ వెంకటరత్నం, భరోసా కేంద్రం ఇన్‌స్పెక్టర్ సువర్ణ, ఎస్సైలు శ్రీకాంత్, సురేశ్‌తోపాటు సిబ్బందిని సీపీ సన్‌ప్రీత్‌సింగ్ అభినందించారు.